సాక్షి కృష్ణాజిల్లా

శనివారం । 29 । జూలై । 2023



సీ ఫుడ్ ఫెస్ట్ ప్రారంభం

మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీ ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం విజయవాడ ఏ కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. పలు రకాల సముద్ర చేపల ప్రదర్శన ఆకట్టుకుంది.



గంజాయి తరలింపు

ఆటబొమ్మల చాటున ట్రక్కు ఆటోలో రూ.60 లక్షలు విలువైన 304 కేజీల గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. -IIలో▸



శివసేవలో కశ్మీర్ న్యాయమూర్తి

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని శుక్రవారం జమ్ము కశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తషిరబ్‌స్తాన్ దంపతులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలి



చిలకలపూడి(మచిలీపట్నం): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు భాగస్వాములు కావాలని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు సతీమణి పి. సుజాత పిలుపునిచ్చారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్ అధికారుల సతీమణుల సంఘం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ సతీమణి, జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్, జిల్లా మహిళా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ సతీమణి సుజాత మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జేసీ అపరాజితాసింగ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 30 వేల మొక్కలను నాటే కార్యక్రమం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి జె. జ్యోతి, ఎంయూడీఏ వీసీ రాజ్యలక్ష్మి, డీఎస్‌వో వి. పార్వతి, డీఈవో తాహెరాసుల్తానా, డీఎస్‌డీవో ఝాన్సీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 2 లక్షలు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్ శ్రీనగర్ కాలనికి చెందిన గుబ్బ చంద్రశేఖర్ కుటుంబం రూ. 2 లక్షల విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను చైర్మన్ రాంబాబు బహూకరించారు.

నేడు ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: సెంట్రల్ ఆంధ్రా జోనల్ సబ్ జూనియర్(అండర్13) ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 29వ తేదీ శనివారం ఎంపిక చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తెలిపారు. 2010 జనవరి ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ లోపు జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు విజయవాడ సింగ్‌నగర్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో ఉదయం ఎనిమిది గంటలకు సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంఘ కోశాధికారి టి.బుజ్జి(9441280384)ను సంప్రదించాలని కోరారు.

పది మందికి పాముకాట్లు



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి పరిసర గ్రామాలకు చెందిన పది మంది వ్యవసాయ కార్మికులు శుక్రవారం పాముకాట్లకు గురయ్యారు. వారు వివిధ గ్రామాల్లో వ్యవసాయ పనులు చేస్తున్నారు. అక్కడ పాముకాట్లకు గురైన కార్మికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్ఞానరత్న పర్యవేక్షణలో బాధితులకు చికిత్స అందించటంతో కోలుకుంటున్నారు.

ఏపీఎన్జీవో మహా సభల పోస్టర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘం రాష్ట్ర 21వ మహాసభల నిర్వహణ చరిత్రలో అతిపెద్ద కార్యక్రమంగా నిలిచిపోయేలా ఆగస్టు 21, 22 తేదీలలో విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎన్జీవో రాష్ట్ర కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ప్రభుత్వ సలహాదారు ఎస్.చంద్రశేఖర రెడ్డితో కలిసి బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

పేదల ఇళ్లపై ఏడుపు

నిర్మాణాలు అడ్డుకోవడమే లక్ష్యంగా ఈనాడు కథనాలు

- కొండలను తవ్వేస్తున్నారంటూ తప్పుడు రాతలు
- వీఎంసీ పరిధిలో జరిగే పేదల ఇళ్ల నిర్మాణాల కోసమని తెలిసినా విష ప్రచారం
- పట్టా భూములను సైతం అటవీ భూములుగా చూపి వితండవాదం
- ప్రజలకు నిజాలు తెలియకుండా గంతలు కట్టే ప్రయత్నం



పాతపాడు సమీపంలోని గుబ్బలగుట్ట ఇదే

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకున్న రామోజీ మరో తప్పుడు కథనాన్ని వండివార్చారు. ఇళ్ల నిర్మాణాలు జరగకుండా అడ్డుకొనే కుట్రకు తెరలేపారు. జగనన్న కాలనీల్లోని లే అవుట్‌లకు మట్టి తరలించి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతుంటే.. చూసి ఓర్చుకోలేక కడుపు మంటతో దిగజారుడు రాతలు రాయిస్తున్నారు. 'గుల్లవుతున్నా..తగ్గమంతే!' అంటూ ఒకటి.. 'నింగిచూసింది.. నిజం చెప్పింది!' అంటూ మరో కథనం రాసి జనాలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. మట్టిదోపిడి చేస్తున్నారని, అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు, మామిడి మొక్కలు పెంచుతున్నారంటూ తప్పుడు వార్తలు అచ్చేశారు. పట్టా భూముల్లో మామిడి మొక్కలు సాగు చేసుకొంటుంటే అటవీ భూమి అంటూ అసత్యపు రాతలు రాశారు.

వాస్తవాలు ఇవి..

విజయవాడ గ్రామీణ మండలం పాతపాడు సమీపంలో గుబ్బల గుట్ట ఉంది. ఇది వీఎంసీ స్థలం. ఆ స్థలంలోని మట్టిని వీఎంసీ పరిధిలో జగనన్న లే అవుట్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల బేస్‌మెంట్లల్లో నింపేందుకు రెవెన్యూ శాఖ అనుమతితో మట్టిని ఉపయోగిస్తున్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి ప్రధానంగా కాలనీల్లో మెరక, రోడ్ల నిర్మాణాలు, బేస్‌మెంట్లను నింపేందుకు దగ్గరలోని చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో మట్టిని వినియోగిస్తున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 15,213, విజయవాడ ఈస్ట్ 10,384, విజయవాడ వెస్ట్ 11,113 మొత్తం 36,728 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 26వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా గుబ్బలగుట్ట మట్టిని నున్న, కొండపల్లి, వెలగలేరు లే అవుట్లకు వినియోగిస్తున్నారు. ఈ లేఅవుట్లలో ఆప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి అయ్యాక, తర్వాత దశకు ఇళ్ల నిర్మాణాలు చేరాలంటే, బేస్‌మెంట్లను తప్పక ఫిల్ చేయాలి. ఈ నేపథ్యంలో అధికారులు గుబ్బల గుట్ట మట్టి దుర్వినియోగం కాకుండా హౌసింగ్, రెవెన్యూ వీఎంసీ అధికారుల పర్యవేక్షణలో తరలిస్తున్నారు. అక్కడ ఎన్ని ట్రిప్పుల మట్టి తవ్వారు.. ఆ మట్టి లే అవుట్లలోని ఇళ్లకు వినియోగిస్తున్నారా లేదా అని పరిశీలిస్తూ, ఇళ్ల నిర్మాణాలకే కచ్చితంగా మట్టిని వినియోగించే విధంగా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈనాడు పత్రిక ఈ మట్టి తరలింపునకు అనుమతులు లేవని, అక్రమ తవ్వకాలంటూ, అడ్డగోలు రాతలు రాస్తూ, పేదల ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగకుండా కుట్రలకు తెరలేపింది. పాత ఫొటోలతో ఏదో జరిగిపోతుందని ప్రజలను మభ్య పెట్టే యత్నం చేసింది.

పట్టా భూముల్లో మామిడి మొక్కలు..

అటవీ భూముల్లో తవ్వకాలు జరుపుతున్నారని, భూమిని చదును చేసి మామిడి మొక్కలు నాటారని ఈనాడు మరో అడ్డగోలు కథనాన్ని వండివార్చింది. దీనికి సంబంధించిన వాస్తవాలు ఇలా ఉన్నాయి. ఈనాడు పత్రికలో ప్రచురించిన ఫొటోలు ఏరియా పూర్తిగా రెవెన్యూశాఖకు చెందినది. ఈ ప్రాంతానికి సంబంధించిన అక్షాంశాలు, రేఖాంశాలను సైతం అటవీ అధికారులు పరిశీలించారు. అది సర్వే నంబర్ 516/హెచ్, 518/1గా గుర్తించారు. దీనికి సంబంధించిన రికార్డులు పరిశీలించగా ఈ స్థలం వెలగలేరుకు చెందిన చల్లగుండ్ల రజనీదిగా గుర్తించారు. అయితే ఈనాడు వాస్తవాలను కప్పిపెట్టి అటవీ భూమిలో అక్రమంగా మట్టిని తవ్వేసి, చదును చేసి, మామిడి మొక్కలు నాటినట్లు అడ్డగోలు రాతలు రాసింది.

ఇళ్ల స్థలాలకే వినియోగించాం..

గుబ్బలగుట్ట వీఎంసీకి చెందిన స్థలం. ప్రస్తుతం వీఎంసీ పరిధిలో 11 లే అవుట్లల్లో ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. రెవెన్యూ శాఖ అనుమతితో అక్కడ మట్టిని ఇళ్ల నిర్మాణాలకు వినియోగిస్తున్నాం. ఈ మట్టి తరలింపునకు సంబంధించి తవ్విన మట్టి కచ్చితంగా లేఅవుట్లకు చేరే విధంగా హౌసింగ్, వీఎంసీ అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేశాం. వీఎంసీ స్థలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరగడం లేదు. ఎవరైనా అలా జరిపితే ఉపేక్షించే ప్రసక్తే ఉండదు.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, విజయవాడ

అది పట్టా భూమే..

ఈ ప్రాంతం అటవీ పరిధిలోనిది కాదు. అది రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టా భూమి వెలగలేరు గ్రామానికి చెందిన రైతు పొలం. అటవీ ప్రాంతంలో అక్రమ తవ్వకాలు తవ్వితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకొంటాం.

– శ్రీనివాసులరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, విజయవాడ

ఇది వైద్య రంగానికి స్వర్ణయుగం



మెడికల్ కళాశాలలో వసతులను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజని, చిత్రంలో ఎమ్మెల్యే పేర్ని నాని, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం వైద్య కళాశాలను సందర్శించిన మంత్రి రజని

కోనేరుసెంటర్(మచిలీపట్నం): స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని శుక్రవారం సందర్శించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, బందరు శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని), కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అపరాజితా సింగ్ మంత్రితో పాటు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి కళాశాలలోని అడ్మినిస్ట్రేటివ్ వింగ్ డిజిటల్ పోడియం, లెక్చరర్ గ్యాలరీ రూములు, అందులోని స్క్రీన్‌లను పరిశీలించారు. వీడియోకాన్ఫరెన్స్‌కు రూంకు వెళ్లి ఇతర జిల్లాల్లోని మెడికల్ కళాశాల సిబ్బందితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహణను పరీక్షించారు. అక్కడి నుంచి బయలుదేరి కళాశాల ప్రాంగణంలోని ఉమెన్స్ హాస్టల్‌కు కేటాయించిన గదులు, విద్యార్థులకు సంబంధించిన భోజనశాల, టాయిలెట్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆమె ఆస్పత్రి అభివృద్ధిపై మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య రంగానికి స్వర్ణయుగమన్నారు. ఆధునిక సదుపాయాలతో ఈ కళాశాల భవనాలు రూపుదిద్దుకున్నాయన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు మాసం నుంచి తరగతులకు సంబంధించి అడ్మిషన్‌లు ప్రారంభం అవుతాయన్నారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల కళాశాలల్లోనూ ఇన్‌స్పెక్షన్‌లు పూర్తి అయినట్లు చెప్పారు.

చిత్తశుద్ధితో..

బందరు శాసనసభ్యుడు పేర్ని నాని మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు అత్యధికంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేది విద్య, వైద్యానికి సంబంధించిన అంశాలపైనే అన్నారు. ఈ రెండు ముఖ్య శాఖలు ప్రభుత్వ పరిధిలో ఉంటే ప్రజలకు ఎంతో కొంత వెసులుబాటు కలుగుతూ ఉంటుందన్నారు. వైద్యుల లభ్యత పెరగాలంటే మెడికల్ కళాశాలల ఏర్పాటు అవసరమన్నారు. ఎన్నేళ్లు పరిపాలన చేశామనేది ముఖ్యం కాదని ఎంత వరకు ఆదర్శంగా పాలన చేశామనేది ప్రజాప్రతినిధుల జీవితానికి గీటురాయి అవుతుందన్నారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో కేవలం 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాలుగేళ్లలో 17 మెడికల్ కళాశాలలు స్థాపించిన ఘన చరిత్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఎన్ని ఎదురైనా ముఖ్యమంత్రి తీసుకున్న ప్రత్యేక చొరవతో కళాశాల నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహారావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఆశాలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ జీఎస్ రమేష్, బందరు ఆర్డీవో ఐ కిశోర్, బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.



ఐతవరం వద్ద వాహనాల రాకపోకలను పునరుద్ధరించిన పోలీసులు



సీఎం సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా తదితరులు

వరద కృష్ణమ్మ

- ఉపనదులు ఉప్పొంగడంతో నిండుకుండలా ప్రకాశం బ్యారేజ్
- 70 గేట్ల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణవేణి
- మునేరు ఉధృతి తగ్గుముఖం
- జాతీయ రహదారిపై రాకపోకలు పునరుద్ధరణ
- వరద పరిస్థితిపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

నందిగామ: ఉపనదుల ఉగ్రరూపంతో కృష్ణమ్మకు వరద పోటు కొనసాగుతోంది. దీంతో ప్రకాశం బ్యారేజ్ నుంచి పెద్ద ఎత్తున నీరు సముద్రుడి చెంతకు పరుగెడుతోంది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎగువన మునేరు ఉధృతి కాస్త తగ్గడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. మరోవైపు జిల్లాలోని వరద పరిస్థితిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతస్థాయిలో సమీక్షించారు.

బస్సుల దారి మళ్లింపు..

మునేరు ఉధృతికి నందిగామ మండలం ఐతవరం సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ఇదే ఉధృతి శుక్రవారం నాడు కూడా కొనసాగింది. దీంతో విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిని పోలీసులు పూర్తిగా మూసివేశారు. హైదరాబాద్ నుంచి నందిగామ మీదుగా విజయవాడ వెళ్లే బస్సులను వయా మధిర మీదుగా మళ్లించారు. ఈ మార్గంలో మరో 42 కిలోమీటర్లు అదనపు దూరం వస్తుందని పలువురు ఆర్టీసీ డ్రైవర్లు తెలిపారు. అయినప్పటికీ ప్రజలను గమ్యస్థానాలకు చేర్చేందుకు సాధారణ చార్జీల తోటే ప్రభుత్వం బస్సులను నడుపుతోంది.



విజయవాడ ప్రకాశం బ్యారేజ్ బ్యాక్ వాటర్ ఇలా..

శుక్రవారం రాత్రికి కాస్త తగ్గుముఖం..

మున్నేటి వరద ఉధృతి శుక్రవారం రాత్రికి కాస్త తగ్గడంతో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఐతవరం సమీపంలో విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను పోలీసులు ఒక్కొక్కటిగా అనుమతిస్తున్నారు. గురువారం సాయంత్రం 4:30 నుంచి జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా.. 27 గంటల తర్వాత శుక్రవారం రాత్రి 7:14 నుంచి వాహనాలను అనుమతిస్తున్నారు. ముందుగా కేవలం విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను మాత్రమే పంపుతున్నట్లు ఏసీపీ జనార్దన్ నాయుడు తెలిపారు. పూర్తి స్థాయిలో వరద తగ్గిన తర్వాత మాత్రమే రెండు వైపులా అనుమతిస్తామని పేర్కొన్నారు.

వరద, పునరావాస కార్యక్రమాలపై సీఎం సమీక్ష

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ పునరావాస కార్యక్రమాలపై శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, పోలీసు కమిషనర్ టి.కె. రాణా, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో కె. మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తేనే సంతృప్తి

- వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు
- మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పరిస్థితులు, డాక్టర్ల తీరుపై ఆగ్రహం



స్కానింగ్ విభాగంలో రికార్డులను పరిశీలిస్తున్న కృష్ణబాబు

మచిలీపట్నంటౌన్: వైద్య వృత్తిలో ఎంతకాలం పనిచేశామనేది కాదని.. ఆస్పత్రికి వచ్చే పేద, మధ్య తరగతి రోగులకు మెరుగైన వైద్యం అందించినప్పుడే వైద్యులకు సంతృప్తి ఉంటుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రి పనితీరుపై ఆయన మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), కలెక్టర్ రాజాబాబులతో కలిసి శుక్రవారం ఆస్పత్రిలోని మీటింగ్‌హాలులో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో సీటీ స్కాన్, డార్క్ రూమ్, కౌన్సిల్ రూమ్, గైనకాలజీ విభాగం, మైక్రోబయాలజీ రూమ్, వైద్యుల బయోమెట్రిక్, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యుల హాజరు తక్కువగా ఉండటం, డ్యూటీ ముగిసే సమయానికన్నా ముందే వెళ్లిపోవడం, పారిశుద్ధ్య కార్మికుల హాజరు తక్కువ ఉండటం, ఆస్పత్రి ఏడీ, ఏవోల పనితీరుపై కృష్ణబాబు అసహనం వ్యక్తం చేశారు. సరిగ్గా పని చేయని వైద్యులు, సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సూపరింటెండెంట్ రమేష్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎంతమందికి మెమోలు ఇచ్చారో చెప్పాలన్నారు. ఆగస్టు నెల నుంచి పనితీరు మార్చుకోకపోతే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రశ్నల వర్షం..

రాష్ట్రంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో 174 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని, మచిలీపట్నం జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారా అని వైద్యులను ప్రశ్నించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు పలు పరీక్షలు చేయించుకుంటే రిపోర్టులు మధ్యాహ్నానికి వస్తాయి కాబట్టి వైద్యులు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య ఓపీలో కచ్చితంగా ఉండాలన్నారు. ఫార్మసీ యూనిట్, సర్జికల్ వార్డుకు వెళ్లి అందుతున్న వైద్య సాయంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు వార్డుల్లో టాయిలెట్ల నిర్వహణ ఏ విధంగా ఉందో ఆయన స్వయంగా పరిశీలించారు. పర్యటనలో డీఎంఈ డీఎస్‌వీఎల్ నరసింహారావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపల్ డి. ఆశాలత పాల్గొన్నారు.

ఉధృతంగా ఏటిపాయ

కంకిపాడు: ఏటిపాయలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ఉపనదులు మహోగ్రంగా ప్రవహించటంతో ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం 2.68 లక్షల క్యూసెక్కుల వరదనీటిని సముద్రంలోకి విడుదల చేశారు. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధి గుండా ప్రవహిస్తున్న కృష్ణానది ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు సముద్రం వైపు ఉధృతంగా సాగుతోంది. ఇప్పటికే మద్దూరు వద్ద ఏటిపాయలోని లంకభూముల్లోకి వెళ్లే రబ్బిష్‌రోడ్డు కోతకు గురై మునిగిపోయింది. ఏటి అవతల గుంటూరు జిల్లాలోని కొల్లిపర, వల్లభాపురం, గొడవర్రు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వారం రోజులుగా కూలీలు, పశువులు, మేకల కాపరులు సైతం ఏటిపాయలోకి వెళ్లటం లేదు. కాసరనేనివారిపాలెం శివాలయం చుట్టూ వరదనీరు చేరింది. స్థానికంగా ఉన్న పుష్కరఘాట్‌లు కొట్టుకువచ్చిన గుర్రపుడెక్కతో నిండిపోయాయి. వరద కారణంగా ఏటిలోపల చేపల వేటకు సిద్ధంగా ఉంచిన పడవలను మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు. ఏటిపాయ ఉధృతిని తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఏటిపాయలోకి ఎవరూ వెళ్లొద్దని, అప్రమత్తంగా ఉండాలని స్థానిక రైతులు, మత్స్యకారులు, జీవాల పెంపకందారులకు సూచించారు.



కాసరనేనివారిపాలెంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్, ఇతర అధికారులు

పరిశ్రమతో పాలిటెక్నిక్ విద్య అనుసంధానం

- విజయవాడ పాలిటెక్నిక్‌లో అవెరా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ల్యాబ్
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి వెల్లడి

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యను పరిశ్రమకు అనుసంధానించే కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవెరా సంస్థ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ల్యాబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవెరా సంస్థ ప్రతినిధులు కళాశాలను సందర్శించి కొత్త భవనంలోని కింద అంతస్తు, ఇతర క్లాసు రూమ్ గదులను పరిశీలించారని పేర్కొన్నారు. త్వరలో ప్రయోగశాల ఏర్పాటుకు ఒప్పందం చేసుకోనున్నట్టు తెలిపారు. అవెరా ఎలక్ట్రిక్ వెహికల్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ సీఈవో, భారత పరిశ్రమల సమాఖ్య విజయవాడ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వెంకట రమణ, ఓఎస్‌డీ కార్తికేయతో పాటు సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెలగా పద్మారావు, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీడియా అకాడమీ ఆధ్వర్యాన ఆన్‌లైన్‌లో నేడు ప్రత్యేక ప్రసంగాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సి.రాఘవాచారి ఏపీ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న డిప్లమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వార్తా రచన-నిర్ధారణ (ఫ్యాక్ట్ చెక్) అనే అంశంపై, 9 నుంచి 10 గంటల వరకు జీవ వైవిధ్యం-ఆవశ్యకత అనే అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ-815 9892 6979, పాస్‌వర్డ్-12345 ద్వారా పాల్గొనవచ్చని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి గంగూరు గ్రామ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిషోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి కంకిపాడు వైపునకు వెళుతున్న బైక్.. గుర్తు తెలియని పాదచారిని ఢీ కొట్టింది. ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడిపిన వ్యక్తి పరారయ్యాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వేస్టేషన్‌లో..



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వేస్టేషన్‌లోని 10వ నెంబర్ ప్లాట్‌ఫాం దక్షిణ వైపు రైల్వేబోర్డు వద్ద వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించిన సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుని వయసు సుమారు 35-40 సంవత్సరాల మధ్య ఉంటుందని, నీలం రంగు నైట్‌ప్యాంటు, వంకాయ రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 0866-257600, 9440765053 నంబర్ల ద్వారా విజయవాడ రైల్వే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా వారు కోరారు.

అంటుకుంటున్నాయి

- వాతావరణ మార్పులు, కురుస్తున్న వర్షాలతో ప్రబలుతున్న అంటువ్యాధులు
- ముందస్తు జాగ్రత్తలతో నివారణ
- ప్రస్తుతం కళ్లకలకలు, వైరల్ ఫీవర్లు
- ఆసుపత్రులకు క్యూ కడుతున్న బాధితులు



మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి కంటి విభాగం వద్ద వైద్యం కోసం వచ్చిన కళ్లకలక సోకిన రోగులు

మచిలీపట్నంటౌన్: వాతావరణ మార్పులు, కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అంటువ్యాధుల ముప్పు పొంచి ఉంది. వీటిపై అప్రమత్తంగా ఉండకపోతే ఆరోగ్యానికి చిక్కులు ఏర్పడతాయి. ఓ వైపు కాలువల ద్వారా వచ్చే కొత్త జలం.. తాగునీటిగా సరఫరా అవుతోంది. వర్షాల కారణంగా వాతావరణంలో ఏర్పడిన మార్పులతో వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంది. ఈ ఏడాది కూడా వైరల్ ఫీవర్లు, డెంగీ వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు ఆహార అలవాట్లను మార్చుకోకపోతే రోగాల బారినపడతారని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా సర్వజన ఆసుపత్రికి రోజూ వైరల్ ఫీవర్లు, కళ్ల కలకలతో రోగులు క్యూ కడుతున్నారు.

పెరుగుతున్న కళ్ల కలకలు

నగరంలో కొన్ని రోజులుగా కళ్ల కలక వ్యాపిస్తోంది. ఈ వ్యాధి వేగంగా వ్యాపించే అవకాశం ఉండటంతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాసుపత్రి నేత్ర వైద్యుడు జి.భానుమూర్తి చెబుతున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రికి రోజూ 15 నుంచి 20 మంది రోగులు కళ్ల కలకలతో చికిత్స కోసం వస్తున్నారు. పరిశుభ్రత పాటించకపోవడం, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువగా తిరగడంతో ఇది సోకుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తాగునీటి కలుషితంతో విరేచనాలు, వైరల్ ఫీవర్లు జలుబు, దగ్గు వంటి వ్యాధులు సోకుతాయంటున్నారు.

కళ్లకలక సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శారీరక పరిశుభ్రత పాటించాలి. జేబు రుమాలు, వస్తువులు ఎక్కువగా తాకకుండా ఉండాలి. కరచాలనం మానేయాలి. కంటి పుసులను తడిదూదితో శుభ్రం చేసుకోవాలి. ఎక్కువ నీటిని తీసుకోవడం శరీరానికి విశ్రాంతి ఇవ్వటం, మాంసకృతులు, ఖనిజ లవణాలు ఉన్న ఆహారం తీసుకోవటం పాటిస్తే కళ్లకలక దరిచేరదు.

కళ్ల దురదలు, మంటలతో ఇబ్బందిపడుతున్నా



మూడు రోజులుగా నా కళ్లు ఎర్రబారి దురదలు, మంటలు వస్తున్నాయి. రాత్రి పూట పుసులు కట్టి కళ్లు తెరవలేకపోతున్నాను. మా ప్రాంతంలో ఇప్పుడిప్పుడే కళ్ల కలకలు వ్యాపిస్తున్నాయి. వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వాసుపత్రికి వచ్చాను. మందులు ఇచ్చారు.

–మరియసుధ, చిలకలపూడి

కాచి చల్లార్చిన నీరు తాగాలి



వాతావరణ మార్పులతో వైరల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. కళ్ల కలక ఇప్పటికే వ్యాపిస్తోంది. ప్రజలు పరిశుభ్రతతో పాటు కాచి చల్లార్చి వడపోసిన నీటినే తాగాలి. వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెందుతాయి. కళ్లకలక సోకిన వ్యక్తి వాడే దుస్తులు, టవల్స్, దుప్పట్లు, దిండ్లు తదితర వస్తువులను కుటుంబ సభ్యులు ముట్టుకోవద్దు. వేపకాయ ట్యూబ్‌తో పాటు యాంటీబయటిక్స్ వాడాలి. స్టెరాయిడ్స్ తీసుకోరాదు. వీటిని తీసుకుంటే నల్లగుడ్డు పెరిగి కంటి చూపునకు ప్రమాదం ఏర్పడుతుంది.

– డాక్టర్ రమేష్‌కుమార్, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

కోనేరుసెంటర్: విద్యుత్‌ఘాతంతో ఓ పెయింటర్ మృతి చెందాడు. ఘటనపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెడనకు చెందిన అబ్దుల్ జబివుల్లా (25) పెయింటర్. మచిలీపట్నం మాచవరానికి చెందిన అబ్దుల్‌ఆషాతో 2021లో వివాహమైంది. పీర్ల పండుగను పురస్కరించుకుని రెండు రోజుల క్రితం భార్యతో కలిసి అత్తగారింటికి వచ్చాడు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ ఇంటి ప్రాంగణంలో నీరు నిలిచింది. దీంతో శుక్రవారం అబ్దుల్‌జబీవుల్లా అతని భార్య కలిసి మోటారు సాయంతో నీరు తోడుతుండగా మోటారు రిపేర్ అయ్యింది. దీంతో అబ్దుల్ జబివుల్లా నీళ్లలో నిలబడి మోటారును రిపేర్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా వైరు చేయి జారి నీళ్లలో పడింది. వైరు నుంచి కరెంట్ సరఫరా కావడంతో జబీవుల్లా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. చికిత్స నిమిత్తం బంధువులు ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే జబివుల్లా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉమ్మడి కృష్ణా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా శివబాజీ



నియామకపత్రం అందుకుంటున్న శివబాజీ

విస్సన్నపేట: ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా విస్సన్నపేటకు చెందిన అనుమోలు శివబాజీ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఏపీ ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొనకళ్ల హరినాథ్ చేతుల మీదుగా విజయవాడ వాసవీభవనంలో శుక్రవారం శివబాజీ అందుకున్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే రూ.2.25 లక్షల సాయం



జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థినికి విమాన టికెట్లను అందజేస్తున్న నేతలు

జి.కొండూరు: పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు. మండలంలోని చెర్వుమాధవరం గ్రామానికి చెందిన బాణావతు శ్రావణి అమెరికాలో ఎంఎస్ చదవడానికి వెళ్తోంది. ఆమె విమాన టికెట్ల ఖర్చుల నిమిత్తం రూ.2.25 లక్షలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ తన సొంత నిధుల నుంచి అందజేశారు. ఈ నగదుతో రిజర్వ్ చేసిన విమాన టికెట్లను శుక్రవారం వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు విద్యార్థిని శ్రావణికి అందజేశారు. శ్రావణి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో తమ ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని విదేశీ విద్య కోసం ఆర్థిక సాయం చేయాలని కోరామని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో సాయం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలోఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య, కేడీసీసీబీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్ర రాణా, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలాశ్రీనివాసరావు, సర్పంచ్ దేశం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు భరోసా

వరద ప్రభావిత ప్రాంతాల్లో డీఎంహెచ్‌ఓ పర్యటన



వత్సవాయిలో గర్భిణి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారికి భరోసా కల్పించారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే సమాచారం ఇస్తే ఆస్పత్రులకు పంపుతామని తెలిపారు. అవసరమైతే ఖమ్మం జిల్లాలోని ఆస్పత్రులకు తరలిస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో వరద పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని శుక్రవారం వత్సవాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాలను సందర్శించారు. వత్సవాయిలో పలువురు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగాల సందర్శించి గురువారం వరద తాకిడి గురైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరం వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వత్సవాయి వైద్యాధికారి డాక్టర్ సుష్మ, వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆటబొమ్మల చాటున గంజాయి తరలింపు

రూ.60లక్షల విలువైన గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తున్న బొమ్మల ట్రక్కు ఆటోతో డీఎస్పీ, సీఐ,ఎస్‌ఐ

ఉంగుటూరు: ట్రక్కు ఆటోలో ఆటబొమ్మల చాటున రూ.60 లక్షలు విలువైన 304 కేజీల గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఆత్కూరు పీఎస్‌లో గన్నవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య విలేకరుల సమావేశంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తుల వివరాలను వెల్లడి చేశారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలో జాతీయ రహదారిపై ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో ఆత్కూరు ఎస్‌ఐ సూర్య శ్రీనివాస్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఏలూరు నుంచి విజయవాడ వైపు ఓ ట్రక్ ఆటోలో ఆట బొమ్మల లోడుతో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. వారి కదలికలపై అనుమానంతో ట్రక్కు ఆటోను తనిఖీ చేశారు. బొమ్మల కింద సుమారు రూ.60 లక్షల విలువైన 304 కేజీల గంజాయి సంచులను గుర్తించారు. ఆ నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనపరచుకుని ఆటోను సీజ్ చేశారు. అనంతరం వారిని పీఎస్‌కు తరలించి విచారించగా చిత్తూరు జిల్లా పుంగనూరు గ్రామానికి చెందిన మల్లెల రాజమ్మ, మల్లెల వెంకటరమణ, పెద్దతిప్పసముద్రంకు చెందిన ఆవుల సంతోష్, ఆవుల లక్ష్మి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి చిత్తూరు జిల్లా పుంగనూరుకు గంజాయి తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. జంక్షన్ సీఐ నవీన్ నరసింహమూర్తి నలుగురిపై ఎన్.డీ.పీ.ఎస్ కేసు నమోదు చేశారు. గంజాయి ఎవరి వద్ద కొనుగోలు చేశారు.. ఎవరికి అమ్ముతున్నారు అనే విషయాన్ని సీఐ విచారణ చేస్తున్నారని తెలిపారు.


ఒకే నెలలో రెండుసార్లు గిరి ప్రదక్షిణ

ఆగస్టు 1, 31న ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఆగస్టు 1వ తేదీ, అదే నెల 31వ తేదీ పౌర్ణమి పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. 1వ తేదీ సోమవారం తెల్లవారుజామున 5.55 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు.

జీజీహెచ్‌లో అపస్మారక స్థితిలో యువకుడు

అనాథలా చికిత్స పొందుతున్న వైనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో సుమారు 30 ఏళ్ల యువకుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. మచిలీపట్నం జాతీయ రహదారిపై గంగూరు పెట్రోలు బంకు వద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని వద్ద పేరు, చిరునామా తెలిపే ఆధారాలు దొరకలేదు. ప్రస్తుతం అనాథలా చికిత్స పొందుతున్నాడు. తలకు గాయం కావడంతో న్యూరోసర్జరీ వైద్యులు శుక్రవారం సాయంత్రం శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం న్యూరోసర్జరీ ఐసీయూలో ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నాడు. అతన్ని వివరాలు తెలిసినవారు ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించవచ్చు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కంకిపాడు: ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పలూరు-మంతెన రైల్వేట్రాక్‌పై గురువారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. గుడివాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంతెనకు చెందిన కొండేటి సామలరావు అలియాస్ స్వామి (51) గురువారం రాత్రి చేలోకి వెళ్లి అక్కడి నుంచి బహిర్భూమికి రైల్వే ట్రాక్ సమీపానికి వెళ్లాడు. ఆ మార్గం మీదుగా వెళ్తున్న రైలు అతన్ని ఢీకొంది. అర్ధరాత్రి సమయంలో ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం స్థానిక రైల్వే సిబ్బంది గుడివాడ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న గుడివాడ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.